క్లుప్తంగా

గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు

పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ గెస్ట్ టీచర్ పోస్టుకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంగ్లిష్ లిటరేచర్‌లో గ్రాడ్యుయేషన్, ఇంగ్లిష్ పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ, టెట్ అర్హత కలిగి జిల్లాకు చెందిన వారై ఉండాలని తెలిపారు. ఈనెల 25న సాయంత్రం 4 గంటలలోపు చిన్నవంగర కేజీబీవీలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

జీఎంపీఎస్ జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్ష కార్యదర్శులు

మహబూబాబాద్ అర్బన్: గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా పయ్యావుల మల్లయ్య, బొల్లం అశోక్‌లను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నిక చేశాడు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహాసభలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మనబోయిన యాకయ్య, ఇమ్మడి గోవిందు, దూదిమెట్ల మోహన్ రావు, సహాయ కార్యదర్శులు గంద్రకోటి కుమార్, కేశబోయిన మల్లయ్య పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి తల్లితండ్రులు తమ పిల్లలను చేర్పించాలని రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ సామ వెంకటరెడ్డి అన్నారు. తెలుగు సమితి అఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ సమితి ఆధ్వర్యంలో చక్రి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని రెడ్యాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం టీషర్టులు, టై బెల్టుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాక రాజేశ్వరి, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉప్పలయ్య, ఆకుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయ దర్శిని’ సంపాదకవర్గ సభ్యుడిగా ఉపేందర్‌రెడ్డి



తొర్రూరు: టీపీటీఎఫ్ అధికారిక మాసపత్రిక ఉపాధ్యాయ దర్శిని సంపాదకవర్గ సభ్యుడిగా తొర్రూరు వాసి సూరం ఉపేందర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆయన గతంలో టీపీటీఎఫ్ సంఘంలో వివిధ హోదాల్లో పని చేసి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

పహల్గాం ఉగ్రదాడిపై కుమార్ కవిత ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్థాయిలో నిర్వహించబడిన శతాధిక కవుల గళంలో జిల్లా కేంద్రానికి చెందిన కవి రచయిత, జల విన్యాసకుడు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు చింత కుంట్ల కుమారస్వామి రాసిన కవిత ఎంపికై పహల్గాం పుస్తకంలో ప్రచురించారు.

కన్వీనర్‌గా రాములు

కేసముద్రం: బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్‌గా మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాచర్ల రాములు నియామకం అయ్యాడు. నియామక పత్రాన్ని సోమవారం మేడ్చల్ జిల్లాలో బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ చేతుల మీదుగా రాములు అందుకున్నాడు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

మరిపెడ రూరల్: తెలంగాణ ఓపెన్ స్కూల్ (టీఓఎస్ఎస్) ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియేట్ దూర విద్య ప్రవేశాలు ప్రారంభమైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరిపెడ కోఆర్డినేటర్ అనంతరావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ జనార్దనాచారి తెలిపారు. ఈసందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ.. 11 జూలై 2025 వరకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 77299 67711 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

దేవుడి కోడె చోరీ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఆమనగల్ గ్రామంలో స్థానిక రైతులు దేవుళ్ల పేరు మీద విడిచిపెట్టిన కోడెలు చోరీకి గురయ్యాయని రైతు నూకల వెంకన్న సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు, స్థానిక ప్రజలు తమకు ఉన్న భక్తి విశ్వాసాల నేపథ్యంలో రెండు పశువులు (కోడెలు) దేవుళ్ల పేరు మీద గ్రామంలో వదిలేశారన్నారు. కోడెలు మూడు రోజులుగా కనిపించటంలేదని రైతులు తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఫీజులు.. పెట్టుబడులు.. వ్యాధులు

అన్ని ఖర్చులు ఒకే నెలలో రావడంతో సర్వత్రా ఆందోళన

- ఆర్థికభారంతో హడలెత్తిపోతున్న సామాన్య ప్రజలు



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



దుక్కి దున్నుతున్న రైతులు

పెద్దవంగర: పేద మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది. పదకొండు నెలల పాటు నెట్టుకొచ్చిన ఆయా కుటుంబాలు జూన్ మాసం వచ్చిదంటే చాలు ఆందోళన చెందుతున్నారు. నెల రోజులపాటు వేసవి సెలవులను ఆటపాటలతో గడిపిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు వెళ్తుండగా వారి తల్లిదండ్రులు పొలం బాట పట్టారు. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలు కావడంతో రైతులు ఎరువులు, విత్తనాలు, కొనుగోలు తదితర ఖర్చులను అధికమించేందుకు ఆలోచనలో పడ్డారు. దీనికి తోడు వానకాలంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఇలా అన్నిరకాల ఖర్చులు ఈ నెలలో రావడంతో ఎలా గడపాలో తెలియక ప్రజలు తికమక ముడుతున్నారు. వేతనంపైన ఆధారపడిన వారికి సైతం ఈ నెల కష్ట కాలమే. ఏడాది అంతా ఆదా చేసిన సొమ్మంతా ఈ నెల్లోనే హరించుకు పోతుంది.

విద్యాసంస్థల ఫీజుల మోత..

జూన్ రెండోవారం నుంచి పాఠశాలలు మొదలయ్యాయి. పాఠశాల పునఃప్రారంభం అంటేనే ఫీజులు, పుస్తకాలు, నోట్ బుక్స్‌లతో పాటు వాటిని భద్రపరుచకునేందుకు బ్యాగులు, లంచ్ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, టై,బెల్టులు, యూనిఫాం.. ఇలా ఒక్కటేమిటి పలు రకాల వస్తువులను ఆయా పాఠశాలల్లోనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. పిల్లలను ప్రైవేటు పాఠశాల్లో చేర్పించేందుకు రూ.20వేల నుంచి రూ. 30 వేల వరకు ఖర్చు అవుతోంది.

పంటల సాగుకు పెట్టుబడులు..

మండల వ్యాప్తంగా ఎక్కువ మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. దుక్కులు దున్ని విత్తనాలు ఎరువులు పెద్దమొత్తంలో ఖర్చు చేస్తున్నారు. యాంత్రీకరణ, ఎరువులు, విత్తనాల ధరలు కూలీల కొరత, చీడపీడలతో వెంటాడుతూనే ఉంటాయి.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..



రోజురోజుకు పెరుగుతున్న సాగు ఖర్చులతో వ్యవసాయం భారంగా మారింది. ఎరువులు, విత్తనాలు, కూలీల ధరలు విపరీతంగా పెరిగిపోతుండడంతో సాగు సీజన్ వచ్చిందంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలకు స్కూల్ ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం ప్రతీది భారమవుతుంది.

– ఎర్పాని రామ్మూర్తి, రైతు, బొమ్మకల్లు

చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

మహబూబాబాద్: పెన్షనర్లకు నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా మైస నాగయ్య మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా చట్టాన్ని అమలు చేసే కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో సోమయ్య, మోహన్‌రావు, నారాయణ, మంగపతి రావు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి



తొర్రూరు: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు

దేశ హితం కోసం పాటుపడిన శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నాయకులు తెలిపారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



గార్లలో..

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్



పీటీఆర్‌ను ప్రారంభిస్తున్న సీఈ రాజు చౌహాన్

కురవి: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సౌకర్యం అందించేందుకు 5ఎంవీఏ నుంచి 8ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ సీఈ రాజు చౌహాన్ అన్నారు. సోమవారం మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో 33/11 కేవీ ఉపకేంద్రంలో గుండ్రాతిమడుగు(విలేజి)లోని 33/11కేవీ ఉప కేంద్రంలో విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు పీటీఆర్ విస్తరణ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ సీఈ రాజుచౌహాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ విజయ్, సునీత, పెద్ది రాజ్యం, ఏడీఈ రమేష్, భీమ్‌సింగ్, లోకనాథ్‌రెడ్డి, ఏఈ శారద, క్రాంతికుమార్, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ జంపిరావు, లైన్‌మన్ వెంకటేశ్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న యుగేందర్‌రెడ్డి

మరిపెడ: మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పార్టీ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల్ల పెద్ద చెరువు కరకట్ట సుందరీకరణకు మున్సిపాలిటీ నిధులు 1.5కోట్లు మంజూరు కాగా, ఇట్టి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు వార్డుల్లో అంతర్గత రోడ్లు సీసీ చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ నరేష్‌రెడ్డి మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే తాజుద్దీర్, నాయకులు అఫ్జల్, గుండగాని వెంకన్న, ఉత్తేజ్ పాల్గొన్నారు.

పాఠశాలల ఏర్పాటుపై కపట ప్రేమ



మాట్లాడుతున్న రమేశ్

నెల్లికుదురు: పూర్వ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుపై ప్రభుత్వం కపట ప్రేమ చూపెడుతోందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలాష్టి రమేశ్ అన్నారు. మండలంలోని నర్సింహులగూడెంలో మండల శాఖ అధ్యక్షుడు ఎడెల్లి యాకయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సబ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోని ప్రతి జిల్లాకు 10పూర్వ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి 12 జిల్లాల్లో 210 ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయడం సహేతుకం కాదన్నారు. 42శాతం గిరిజనులున్న జిల్లాల్లో కూడా ఒక్క ప్రాథమిక పాఠశాలకు అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కొత్త వెంకటేశ్వర్లు, పద్మావతి, శ్రీరాం, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



ఎంపీడీఓకు సమ్మె నోటీసు ఇస్తున్న అప్పిరెడ్డి

గార్ల: జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ మంగమ్మకు ఆయన సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి 3నెలలు గడుస్తున్నా నేటికీ వేతనాలు చెల్లించలేదన్నారు. ఈనెల 27న చలో హైదరాబాద్ కమిషనర్ ఆఫీస్ ముందు నిర్వహించే ధర్నాలో పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పిడమర్తి దాసు, కిరణ్, శ్రీను, కోటేశ్వరి, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వితంతువులను చిన్నచూపు చూడొద్దు



చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలవికాస సభ్యులు

చిన్నగూడూరు: సమాజంలో వితంతువులను చిన్న చూపు చూడకుండా సమానంగా చూడాలని ఉగ్గంపల్లి మాజీ ఎంపీటీసీ భర్తాపురం ఉదయమ్మ కొమిరెల్లి అన్నారు. సోమవారం అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఉగ్గంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ గంధశిరి ఉపేంద్ర, సహ కోఆర్డినేటర్స్ జుజ్జూరి ఉపేంద్ర, దొనికెన ఉపేంద్ర, సునీత, సరళ, నిర్మల పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: సమాజంలో వితంతువులను చిన్నచూపు చూడవద్దని బాల వికాస స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మద్దెల రమా కోరారు. సోమవారం మండలంలోని వెలికట్ట గ్రామంలో బాల వికాస సంస్థ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువు మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కనుకుంట్ల కుమారస్వామి, శైలాజ, శోభా, సరిత, ప్రమీల, ధనలక్ష్మి, అలివేలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. డోర్నకల్ ఏఎస్సై కోటేశ్వర్‌రావు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రేగళ్ల ఎల్లయ్య(35) పలు కారణాలతో ఈనెల 10న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు ఖమ్మం, వరంగల్ ఆస్పత్రుల్లో చికిత్స అందించిన అనంతరం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సోమవారం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏఎస్సై తెలిపారు.

శస్త్రచికిత్స వికటించిందని ఆందోళన

మహబూబాబాద్ రూరల్: రోగుల ప్రాణాలతో ఓ వైద్యుడు చెలగాటమాడుతున్నాడని ఆరోపిస్తూ, సదరు వైద్యుడిపై చర్య తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోగి బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈసంఘటన జిల్లా కేంద్రంలోని రెడ్డి బజారులో గల ఆయుష్ ఆస్పత్రి ఎదుట సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రోగి భర్త బైరోజు బ్రహ్మచారి, కుమారుడు కార్తీక్ మాట్లాడుతూ.. జంగిలిగొండ గ్రామానికి చెందిన బైరోజు రమాదేవి కడుపు నొప్పితో బాధపడుతుండగా మార్చి 18వ తేదీన జిల్లా కేంద్రంలోని రెడ్డి బజారులో గల ఆయుష్ ఆస్పత్రికి తీసుకువచ్చామని తెలిపారు. ఆమెను పరీక్షించిన వైద్యుడు అంజన్ కుమార్ శస్త్రచికిత్స చేసి గర్భసంచి తొలగించారన్నారు. శస్త్రచికిత్స చేసినప్పటి నుంచి రమాదేవికి మూత్రం రాక ఇబ్బంది పడుతూ మూడు నెలలుగా ఆ వైద్యుడి చుట్టూ తిరిగినప్పటికీ ఎలాంటి ఫలితంలేదన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించిందని, హైదరాబాదులోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని తెలిపారు. నిర్లక్ష్యంగా శస్త్ర చికిత్స చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై వైద్యుడు అంజన్ కుమార్‌ను వివరణ కోరగా రమాదేవికి తాను వైద్య చికిత్స చేసిన అంశంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించలేదని తెలిపారు.

గ్యాస్ డీలర్ల ఇష్టారాజ్యం..!

- సిలిండర్‌పై అదనంగా వసూళ్లు
- అధికారుల తనిఖీలు నిల్

మహబూబాబాద్: జిల్లాలో సంబంధిత అధికారుల తనిఖీలు లేక పోవడంతో గ్యాస్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలనే గ్యాస్ సిలిండర్ ధర రూ.50పెంచడంతో తీవ్రభారం పడగా దీనితోడు డీలర్లు సిలిండర్‌పై అదనంగా రూ.16వసూలు చేస్తున్నారు. చాలా మందికి సబ్సిడీ డబ్బులు రాక వినియోగదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీలర్లు వ్యవహరిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 2,11,531 ఉన్నాయి. కాగా గ్యాస్ ధర రూ.874 ఉండగా ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.50 పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూ.326.62, కేంద్రం నుంచి రూ.47.38 రావాల్సి ఉంది. కాగా నేటి చాలా మందికి సబ్సిడీ రావడం లేదు. గ్యాస్ ధర పెరిగి సబ్సిడీ రాక ఇతరత్రా ఇబ్బందులు పడుతున్నాన్నారు. వాస్తవానికి గ్యాస్ సిలిండర్‌కు రూ.924 నుంచి రూ.940 తీసుకుంటున్నారు. డెలివరీ బాయ్స్ అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

గ్యాస్ సిలిండర్ ధర రూ.924 ఉండగా, అంతే ఇవ్వాలి. అదనంగా ఇవ్వొద్దు. దూరం పెరిగితే అదనంగా తీసుకుంటున్నారు. అదనంగా వసూళ్లు చేస్తున్న డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

– ప్రేమ్‌కుమార్, డీసీఎస్‌ఓ

సంక్షిప్త సమాచారం

నేడు రైతుభరోసా విజయోత్సవ సంబురాలు

గూడూరు/నెల్లికుదురు: రైతు వేదికల్లోని వీడియో కాన్ఫరెన్స్‌లలో నేడు మంగళవారం రైతు భరోసా విజయోత్సవ సభ ప్రసారం అవుతుందని ఏఓలు సోమవారం తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని, రైతు వేదికల క్లస్టర్ పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై తిలకించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బయ్యారం: మండలంలోని సింగారం(కొత్తపేట)లో రహదారుల నిర్మాణానికి ఎంపీ ల్యాండ్స్ కింద మంజూరైన రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌నాయక్, సీతారాంరెడ్డి, రవి, గోపాల్, రాందాస్, శివ, సీతారాముల పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

మరిపెడ రూరల్: జర్నలిస్టుల ఐక్యవేదిక మరిపెడ మండల నూతన కమిటీని జిల్లా కన్వీనర్ కట్కూరి ప్రసాద్, కో కన్వీనర్ జిన్నా లచ్చయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మేరుగు సంజీవ, గౌరవ అధ్యక్షుడిగా వంకాయలపాటి తిరుమలరావు, ప్రధాన కార్యదర్శిగా చింత వెంకన్న, కోశాధికారిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా సోమన్న, సహాయ కార్యదర్శిగా వెంకటేష్‌లను ఎన్నుకున్నారు.

లారీ ఢీకొని బొడ్రాయి ధ్వంసం

పెద్దవంగర: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న రైతు బజార్ ఎరువుల దుకాణానికి ఎరువుల లోడుతో లారీ వచ్చింది. లారీ అదుపుతప్పి బొడ్రాయి మీదకు దూసుకెళ్లింది. గ్రామానికి రక్షణగా నిలుస్తుందని నమ్మే బొడ్రాయి ధ్వంసం కావడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

గార్ల: రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. సోమవారం మండలం లోని పినిరెడ్డిగూడెం గ్రామంలో పత్తిపంటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

బయ్యారం: మండలంలోని గౌరారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మహబూబాబాద్‌కు చెందిన శ్రీవాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు గర్రెపెల్లి వెంకటేశ్వర్లు, గోపు రాము, ప్రదీప్, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోన్లు ఇవ్వడం లేదని ఆందోళన

బయ్యారం: కొన్ని సంవత్సరాలుగా తమకు లోన్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని డ్వాక్రా మహిళలు సోమవారం గంధంపల్లి ఎస్‌బీఐ ఎదుట ఆందోళన నిర్వహించారు. మంగళవారం ఆర్‌ఎం వచ్చి సమస్యపై మాట్లాడతారని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



గార్ల: రైతుల వ్యవసాయ మోటార్ల లోఓల్టేజీ సమస్యను తీర్చేందుకు విద్యుత్‌శాఖ రూ.5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 100కేవీ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ ఏఈ మహేంద్ర బాబు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబమూర్తి, నరేష్, రైతులు రమేష్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

నెల్లికుదురు: ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు మాత్రమే మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు చందు రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, పాపారావు, యాకిరెడ్డి, యుగేందర్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

దంతాలపల్లి: పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని పెద్దముప్పారం, రామవరం గ్రామాల ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం ఆమె సందర్శించారు.

చెట్లు నరికితే చర్యలు

దంతాలపల్లి: అక్రమంగా చెట్లు నరికితే చర్యలు తప్పవని మహబూబాబాద్ డివిజన్ ఫారెస్ట్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా చెట్లు నరికితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గణేష్, సత్యనారాయణ, బలయ్య, లక్ష్మణ్‌నాయక్, రామారావు, సందీప్, పాపయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

తొర్రూరు రూరల్: మండలంలోని హచ్చుతండా ప్రభుత్వ పాఠశాలలోని నిరుపేద విద్యార్థులకు మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నోటు బుక్స్, పలకలు, పెన్నులు, స్వీట్లు, పండ్లు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్‌కుమార్, ఇమ్మడి రాంబాబు, కాసోజు రాజేష్, బిజ్జాల ప్రసాద్, హెచ్‌ఎం పల్లవి పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

మహబూబాబాద్: తనకు చెందిన స్థలాన్ని కబ్జా చేస్తున్నారని గార్ల మండలం కోట్యా నాయక్‌తండాకు చెందిన సునీత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో వినతి అందజేశారు.

బైండోవర్

మహబూబాబాద్ రూరల్: పట్టణానికి చెందిన రౌడీషీటర్ జిట్టబోయిన వంశీని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. వంశీ తన పద్ధతి మార్చుకోకుండా పలు గొడవల్లో తలదూర్చి ఘర్షణలకు కారణమవుతునట్లు గుర్తించి బైండోవర్ చేశామన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌజన్య

మరిపెడ రూరల్: అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ సౌజన్య సూచించారు. సోమవారం మరిపెడ మండలం నీలికుర్తి సెక్టర్‌లోని నీలికుర్తి, మూన్యతండా, భజనతండాలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలలో రాష్ట్రీయ బాల స్వస్తి కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల కంటి చూపు, రేచీకటి లోపాలను పరీక్షించారు. టకార్యక్రమంలో వెంకన్న, సిబ్బంది బాలాజీ, ఏఎన్‌ఎం కల్యాణి, మూన్యతండ అంగన్‌వాడీ టీచర్ కనకమ్మ, ఆయా పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

కురవి: మండలంలోని బలపాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, నాయకులు బాదావత్ బిక్కు నాయక్, అంబటి వెంకటనారాయణగౌడ్, నాగేశ్వర్‌రావు, నారాయణ పాల్గొన్నారు. అలాగే నల్లెల్ల శివారు గాజా తండా జీపీ పరిధిలోని టేకుల తండాలో మండల అధ్యక్షుడు అంబటివీరభద్రంగౌడ్ శంకుస్థాపన చేశారు.

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డు సుందరయ్య నగర్తండాలో భూక్యా శిరీషకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ సోమవారం ముగ్గు పోసి శంకుస్థాపన చేశారు. ఖలీల్, బోడ రవి, ఎడ్ల రమేశ్ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మండలంలోని ఎల్లంపేట గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకుడు గండి రమేశ్ శంకుస్థాప చేశారు. మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.